క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి, కొల్చారం, చిలిప్‌చెడ్ మండలాల్లో గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ శివకుమార్ బుధవారం తెలిపారు. కౌడిపల్లిలోని 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెంటెనెన్స్ పనులు జరుగుతాయన్నారు. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

నేటి నుంచి బడులు ప్రారంభం


పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్‌లో ఉన్న ఎంజేపీ బాలుర, బాలికల పాఠశాలల్లో సిబ్బంది తరగతి గదులను శుభ్రం చేశారు. సంక్రాంతి సెలవులు పూర్తి కావడంతో తిరిగి గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అందు కోసం తరగతి గది, వాటర్, ఆట స్థలాలను శుభ్రం చేశారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు


అధ్వానంగా బూర్గుపల్లి వెళ్లే రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ – బోధన్ రోడ్డు నుంచి బూర్గుపల్లికి వెళ్లే మార్గంలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంతలమయం అయింది. దీంతో వాహనాదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు రాత్రివేళల్లో కనిపించకపోవడంతో అందులో పడి గాయాలైన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రజలు పేర్కొన్నారు. అధికారులు స్పందించి.. రోడ్డు మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

ముగిసిన రామలింగేశ్వర రథోత్సవం



తూప్రాన్: మండల పరిధిలోని ఇస్లాంపూర్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వర ఆలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులుగా జాతర కొనసాగింది. బుధవారం ముగింపులో భాగంగా ఉదయం స్వామివారి ఆలయం చుట్టు రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

శివ్వంపేట(నర్సాపూర్) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి మండల ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌చారి 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ వారికి తోచిన విధంగా డబ్బులు జమచేసి రూ.10 వేల నగదుని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు దామోదర్, సంజీవ చారి, భాస్కర్, ప్రభాకర్, లక్ష్మణ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల విద్యాసంస్థలో 2024- 25 విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

బస్‌డిపో ఏర్పాటు కలేనా?

- రామాయంపేటలో డిపోకు స్థలం కేటాయింపు
- ఏళ్లు గడుస్తున్నా.. ప్రారంభంకాని పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో బస్‌డిపో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌డిపో ఏర్పాటుకు రామాయంపేటలో విలువైన స్థలాన్ని ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో డిపోకు కేటాయించారు. కాగా అప్పుడు రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ డిపో స్థలాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు డిపో స్థలాన్ని పరిశీలించి, త్వరగా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా పనులు ప్రారంభంకా లేదు. డిపో మంజూరైనప్పటికీ సుమారుగా 27 ఏళ్లు అవుతున్నా.. అతీగతీ లేకపోవడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకొని డిపో మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


బస్‌డిపో నిర్మాణానికి కేటాయించిన స్థలం

> **డిపో మంజూరు చేయాలి**
>
> 
>
> పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రామాయంపేటకు బస్ డిపో మంజూరు చేయాలి. రూ. కోట్లు విలువచేసే స్థలాన్ని గతంలోనే ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినా ఇంతవరకు మంజూరుకాలేదు. డిపో మంజూరైతే పట్టణం అభివృద్ధి సాధించడంతో పాటు మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయం కలుగుతుంది.
>
> – జితేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్, రామాయంపేట

దుండగులను కఠినంగా శిక్షించాలి

విశ్వకర్మ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం నాయకులు

నర్సాపూర్‌రూరల్: హైదరాబాద్ ఎల్లమ్మబండ వద్ద ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నర్సాపూర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల భిక్షపతి చారి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాట్లాడుతూ.. తెలంగాణ దశ దిశ చూపిన ఒక గొప్ప మహా వ్యక్తిని విగ్రహాన్ని కూల్చడం బాధాకరం అన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి, వడ్ల భాస్కర్ చారి, లింగం చారి, సదానందం చారి, ప్రవీణ్ చారి, నరసింహ చారి, శివచారి, నాగరాజ్ చారి, శ్రీకాంత్ చారి, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం 2024 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ ఆవిష్కరించారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెదల భాస్కర్, ఉపాధ్యాయులు బట్టు లక్ష్మీప్రసాద్, శ్రీనివాస్, సురేష్‌కుమార్, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హవేలిఘణాపూర్(మెదక్): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మెదక్ మండలం మగ్దూంపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, ఎరువుల సబ్సిడీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. మండల పరిధిలోని రత్నపూర్ తదితర గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివిధ శాఖల సిబ్బంది అవగాహన కల్పించారు. పీఎం జీవనజ్యోతి, సురక్ష బీమా, వ్యవసాయ సాగులో అగ్రిగోన్ పిచికారీ, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివిధ శాఖల సిబ్బంది అన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): రత్నపూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

గడప గడపకు అయోధ్య అక్షింతలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటపూర్(కె) గ్రామంలో బుధవారం శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శ్రీరామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలో జైశ్రీరామ్ అంటూ నినాదాలతో అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అయోధ్యలో ఈనెల 22న శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వెంకటపూర్(కె) గ్రామంలో గడప గడపకు శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ అక్షింతలను ఆ దేవదేవుడు శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన తర్వాత కుటుంబ సభ్యులు అక్షింతలను తలపై వేసుకోవాలని ఆ శ్రీరామచంద్రుని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ కమిటీ సభ్యులు, సర్పంచ్ అనిల్ కుమార్, సోమన్న కిష్టయ్య, నందు, రాజేందర్, సాయిలు, రాజలింగం గౌడ్, స్వామి, బన్ని, అశోక్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటపూర్(కె)లో అక్షింతలను అందిస్తున్న శ్రీరామ కమిటీ సభ్యులు

కొట్టాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో బుధవారం అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామస్తులు శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద అక్షింతలకు పూజలు చేసి, గ్రామంలో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రామ మందిర అక్షింతలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలనంతరం రామ కీర్తనలతో ర్యాలీ చేపట్టారు. సికింద్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి అక్షింతలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్, బీజేపీ నాయకులు, భక్తులు, గ్రామస్తులు ఉన్నారు.


నర్సాపూర్ రూరల్: అయోధ్య అక్షింతల ఊరేగింపు

మంతూర్‌లో ..

నర్సాపూర్ రూరల్: మండలంలోని మంతూర్ గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. హనుమాన్ ఆలయం నుంచి పలు వీధుల గుండా రాముడి అక్షింతలతో ఊరేగించి, ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు పంతులు, దశరథ పటేల్, దశరథ్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): సికింద్లాపూర్‌లో అక్షింతలు ఊరేగింపు


కౌడిపల్లి(నర్సాపూర్): కొట్టాల ఆలయంలో అక్షింతలతో గ్రామస్తులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట శివారులోని బోనాల్ రోడ్డు ఓ ఇటుక బట్టీ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం చేగుంట శివారులోని ఓ ఇటుక బట్టీ సమీపంలోని మురికి కాల్వ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా.. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదు. మృతుడు రోడ్డు పక్కన కాగితాలు, పాత ఇనుప సామాను సేకరించే వ్యక్తి కావచ్చునని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతుడి బంధువులు ఎవరైనా చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాసంగికి సాగునీరు ఇవ్వండి

కొండపాక(గజ్వేల్): యాసంగి సాగుకు నీటి ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి కోరారు. తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులకు నీరు వచ్చే కాలువను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను కాలువ ద్వారా చెరువులకు తరలించిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయన్నారు. సాగు చేసిన వరి పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం గతంలో మాదిరిగా తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ 4 కెనాల్ నుంచి గోదావరి జలాలు చెరువుల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అక్కడక్కడ దెబ్బతిన్న కాలువ మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు సున్నం భాస్కర్, గూడెపు భూపతిరెడ్డి, చెంది మల్లికార్జున్, యాదగిరి, సాయిలుతో పా తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి


మాల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధిలో తీర్చిదిద్దుతానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో నూతన పంచాయతీ, అక్బర్‌పేటలో పీహెచ్‌సీ సబ్‌సెంటర్, మోతెలో మాల కమ్యూనిటీ హాల్‌తో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ గజ్జెల సాయిలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొంపెల్లి మనోహర్, సోలిపేట సతీష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కాలేరు శ్రీనివాస్, సుగుణ, స్వరూప, ఉపసర్పంచ్ మానస, నాయకులు సూకూరి లింగం, వల్లాల సత్యనారాయణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమానా

హవేళిఘణాపూర్(మెదక్): మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి మెదక్ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన ఒక రోజు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని స్కూల్ తండాకు చెందిన కెతావత్ మోహన్ మంగళవారం సాయంత్రం మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడు. దీంతో అతన్ని పోలీసులు పట్టుకొని కేసు చేయగా, వారిపై కూడా దురుసుగా ప్రవర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా మెదక్ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన ఒక రోజు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు. ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపుకూడదని హెచ్చరించారు.

కోదండరాంను కలిసిన నాయకులు

వర్గల్(గజ్వేల్): వేములవాడకు వెళుతున్న టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాంను బుధవారం వర్గల్ మండలం గౌరారం వద్ద జిల్లా టీజేఎస్ కన్వీనర్ నీరుడి స్వామి, యువజన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి, పొన్నాల కుమా ర్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను, సిబ్బంది సమస్యలను ప్రొఫెసర్ కోదండరాం దృష్టికి తీసుకెళ్లారు. పనిభారం, ప్రమోషన్లు, పదోన్నతులు తదితర అంశాలను వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ నవీన్‌గౌడ్ తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

దుబ్బాక: ఈనెల 22వ తేదీ వరకు కొత్త ఓటర్ నమోదు, ఓటర్ జాబితాలో మార్పులకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి సూచించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. గజ్వేల్‌కు చెందిన లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో రీజియన్ క్లబ్స్ నిర్వహించిన కార్యక్రమ చిత్రాల పోస్టర్‌ను హైదరాబాద్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ లయన్స్ క్లబ్ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రటరీ సంజయ్‌గుప్త, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, రచయిత విశ్వేశ్వర్‌రావు, ప్రతినిధులు శంకర్, నారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బుధవారం బహుమతుల పంపిణీ చేపట్టారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తాలుకా స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీలో 436 మంది మహిళలు పాల్గొనగా ఇందులో గెలుపొందిన పలువురికి పట్టణంలోని మురళీకృష్ణాలయంలో బహుమతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటిచెబుతూ ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్న రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర బాధ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, దేవాలయ కమిటీ సభ్యులు రామచంద్రం, మెట్రాములు, లక్ష్మయ్య, మధు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.